తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
24 సెప్టెంబర్ 2026

## భారత అండర్-15 బాలికల సాఫ్ట్‌బాల్ జట్టుకు ఈశ్వరి ఎంపిక

- కూలీల కుటుంబం నుంచి దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి..
- చైనాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు అంతర్జాతీయ టోర్నీ


BANOTHU ESHWARI



**నంగునూరు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఈశ్వరి భారత అండర్-15 బాలికల సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైంది. అక్కన్నపేట మండలం కపూర్ నాయక్ తండాకు చెందిన వ్యవసాయ కూలీలు భానుతు ప్రభాకర్, విజయ దంపతుల కుమార్తె అయిన ఈశ్వరి, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కఠోర సాధనతో ఈ ఘనత సాధించింది. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ అండర్-15 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆమె భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది.

వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచిన ఈశ్వరి కఠినమైన ఎంపిక ప్రక్రియలో భారత జట్టులో చోటు సంపాదించింది. గట్ల మల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ దర్శనాల రాజ్‌కుమార్ వద్ద శిక్షణ పొందిన ఆమె జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. చదువులోనూ చురుగ్గా ఉంటూ క్రమశిక్షణతో ముందుకు సాగుతోందని ప్రధానోపాధ్యాయుడు మాదాసి రమేశ్ తెలిపారు. ఆమె ఎంపిక పాఠశాలకు గర్వకారణమన్నారు.

ఈశ్వరి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో గ్రామ సర్పంచ్ ఇంగే నరేశ్, గ్రామస్థులు అభినందించారు. విదేశీ పర్యటన అవసరాల కోసం తమవంతు ఆర్థిక సహాయం అందించారు. పాఠశాల నుంచి తొలిసారిగా ఓ విద్యార్థిని అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషమని సర్పంచ్ తెలిపారు.

ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈశ్వరిని ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు నేతి కైలాసం శాలువాతో సత్కరించి నగదు ప్రోత్సాహకం అందించారు.

చైనాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ సెక్రటరీ రేణుక మాట్లాడుతూ గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ

- ప్రాంతీయ సమన్వయకర్త కె.నాగార్జునరావు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** 2026-27 విద్యా సంవత్సరానికి గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మిగిలిన సీట్లకు నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతీయ సమన్వయకర్త కె.నాగార్జునరావు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని ఎంపిక చేసిన గురుకుల కళాశాలల్లో ఈ ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

పదో తరగతి ఉత్తీర్ణులైన బాలురు, బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునీ తెలిపారు. సెప్టెంబర్ 24, 25, 26 తేదీల్లో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా సంప్రదించి, ఖాళీలు ఉన్న సమూహాల్లో ప్రవేశం పొందవచ్చు. విద్యార్థులు ముందుగా ఫోన్ ద్వారా కళాశాలను సంప్రదించి తమకు కావాల్సిన సమూహంలో సీట్లు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లాలోని గురుకుల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ సమూహాల్లో ఖాళీలను బట్టి ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి, నిర్దేశిత తేదీల్లో కళాశాలకు హాజరై ప్రవేశం పొందాలని సూచించారు. విద్యార్థులు సంప్రదించాల్సిన ఆయా కళాశాలల **ప్రిన్సిపాల్ సెల్ నెంబర్..** జిన్నారం. 9849237238 , నారాయణ ఖేడ్..9948787987 కంగ్టి..8500481205,, జహీరాబాద్..9177 942309, మనూర్ 8885609167, కల్హేర్., సిర్గాపూర్..9494315906

### జవహర్ నవోదయ విద్యాలయంలో
## ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027బి28 సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించనున్న లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (LEST-2027) కు అర్హు లైన విద్యార్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. జవ హర్ నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ ప్రాం తం ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దర ఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమైం దన్నారు. సెప్టెంబర్ 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

9వ తరగతి LEST కోసంhttps://cbseitms.nic.in/2026/nvsix/_9,11వ తరగతి LEST కోసం https://cbseitms.nic.in/2026/nvsxi_11/ అర్హులైన విద్యార్థులు పై ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లాటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ 2027 ఏప్రిల్ 10వ తేదీన నిర్వ హించనున్నట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు అర్హులైన విద్యార్థులకు ఈ అవకాశంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదం డ్రులకు పరీక్షకు సంబం ధించిన వివరాలను తెలియజేసి గరిష్టంగా దరఖాస్తులు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని కోరా రు.జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## వైద్య శాఖలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా వైద్య అధికారి జయ చంద్రమోహన్

**నారాయణపేట, సెప్టెంబర్ 23(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా లో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్‌లో గల వివిధ పోస్టులైన వీసీసీఎం - 01, పల్లె దవాఖానా ఎంఎల్‌హెచ్‌పీ / సీహెచ్ ఓ / వైద్యాధికారి - 06, వైద్యుడు - ఎంబీబీఎస్ / ఎండీ - 01, స్టాఫ్ నర్స్ (ఎన్‌సీడీ) - 01, ఫిజియోథెరపిస్ట్ (ఎన్‌పీహెచ్‌ఈ) - 01, ఫార్మసిస్ట్ (ఆర్‌బీఎస్‌కే) - 01, ల్యాబ్ టెక్నీషియన్ (ఆర్ఎన్‌టీసీపీ) - 01, కాంట్రాక్ట్ విధానంలో పనిచేయుట కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వైద్య అధికారి జయచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పై తెలిపిన ఉద్యోగ పోస్టులకు సంబంధించిన దరఖాస్తులను 25.09.2026 నుండి అన్ని పనిదినములలో ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, నారాయణపేట కార్యాలయంలో సమర్పించగలరనీ తెలిపారు.

మిగతా 10లో..

## బీచుపల్లిలో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

- త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తిచేసి ప్రాసెసింగ్ యూనిట్ పనులు ప్రారంభం
- జిల్లా ఉద్యానశాఖ అధికారి రాజ్‌కుమార్



మిగతా 5లో..

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 23(జనంసాక్షి):** ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ఆయిల్ మిల్లులో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ఫ్యాక్టరీ లేఅవుట్‌ను ఖరారు చేసేందుకు టీజీ ఆయిల్‌ఫెడ్, హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

బుధవారం బీచుపల్లి ఆయిల్ మిల్లును టీజీ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన టి. సుధాకర్ రెడ్డి, జే. సత్యనారాయణ - మేనేజర్ (మార్కెటింగ్), శ్రీకాంత్ రెడ్డి - మేనేజర్ (ప్లాంట్స్ అండ్ ప్రాజెక్ట్స్), ఆకుల బాలకృష్ణ - మేనేజర్ (టెక్నికల్) తదితరులతో కూడిన సాంకేతిక బృందం పూర్తిగా పరిశీలించినట్లు రాజ్‌కుమార్ తెలిపారు.

ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, యంత్రాల ఏర్పాటు, ఉత్పత్తి ప్రక్రియకు అనుగుణంగా ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను సాంకేతిక బృందం పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా సీడ్ హౌస్‌లో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన నమూనా లేఅవుట్‌ను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఖరారు చేసిన లేఅవుట్‌కు అనుగుణంగా తదుపరి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సాంకేతిక బృందం తెలిపిందని రాజ్‌కుమార్ వెల్లడించారు.

## అక్టోబర్ నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- 2.60 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు సన్నద్ధం.. 450 కేంద్రాల ఏర్పాటు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ నెలాఖరులోగా ప్రారంభించేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్‌కుమార్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఇన్‌చార్జిలకు 10-15 రోజుల్లో మండలాల వారీగా శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో అవకతవకలకు పాల్పడిన కేంద్రాల నిర్వాహకులకు ఈసారి బాధ్యతలు అప్పగించవద్దని స్పష్టం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో తేమ, బరువు కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు తదితర సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. కొలత పరికరాలను 15 రోజుల్లో తనిఖీ చేసి ధ్రువీకరించాలని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధాన్యం నిల్వకు అదనపు స్థలాల గుర్తింపు జిల్లాలో కొనుగోలు చేసే ధాన్యం నిల్వకు అవసరమైన స్థలాలను వెంటనే గుర్తించాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. జిల్లాలో 42 మిల్లులు ధాన్యం కేటాయింపునకు అర్హత కలిగి ఉన్నాయని, వాటి నుంచి బ్యాంకు గ్యారంటీలు, అగ్రిమెంట్ల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం గోడౌన్లలో సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు అంచనా వేస్తున్న నేపథ్యంలో పూర్తి సామర్థ్యంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**లారీలకు జీపీఎస్ తప్పనిసరి...**

ధాన్యం రవాణాకు కనీసం 50 లారీలను అందుబాటులో ఉంచాలని, వాటికి అక్టోబర్ 10లోగా జీపీఎస్ పరికరాలు అమర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రవాణాలో జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు.

**450 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు...**

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం సుమారు 450 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతుల వివరాల నమోదు, ట్యాబ్ ఎంట్రీలు, తూకం, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో రామ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆంజనేయులు, పౌరసరఫరాల డీఎం హరీష్, డీటీఓ సురేష్, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ అధికారి పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న మద్యం దుకాణాలు మూసివేత

- ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు తదితరాలను తాత్కాలికంగా మూసివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.
తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968లోని సెక్షన్ 20 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సియుఆర్ఇ) పరిధిలోని ప్రాంతాలను మినహాయించి, సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని అన్ని ఏ 4 మద్యం దుకాణాలు, 2-బి బార్లు, కల్లు దుకాణాలు/కల్లు డిపోలు, సి ఎస్-2 క్యాంటీన్లు మూసివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
ఈ మూసివేత 2026 సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 6:00 గంటల నుంచి సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6:00 గంటల వరకు అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.
గణేష్ నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో పాటు భారీ ఊరేగింపులు జరిగే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.
ఉత్తర్వులను ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు



క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

## రైఫిల్ షూటింగ్‌లో ఆహిల్ ప్రతిభ.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

- మారుమూల గ్రామం నుంచి రాష్ట్రస్థాయికి విద్యార్థి
- అభినందించిన పాఠశాల యజమాన్యం





**మునిపల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన అండర్-14 బాలుర ఓపెన్ సైట్ రైఫిల్ షూటింగ్ విభాగంలో సెలెస్టికా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, బుధేరా పాఠశాల విద్యార్థి ఆహిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఆహిల్ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భవాని తెలిపారు. మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరచడంతో పాటు చదువులోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని ఆమె అన్నారు. భవిష్యత్తులో ఆహిల్ మరిన్ని విజయాలు సాధించి పతకాలు సాధించాలని, తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యం మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆహిల్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## రజక హక్కులు, అభివృద్ధికి కృషి చేస్తా

- రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి రాజు



**బెజ్జంకి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి-రజక సంఘం సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీటి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. రజక జాతి ఐక్యత, హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తానన్నారు. జిల్లా సభ్యులను సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం అందేలా పనిచేస్తానన్నారు. రజక జాతి ఐక్యతే బలమని, అభివృద్ధే లక్ష్యమని పేర్కొన్నారు.

## 11 కేవీ లైన్‌కు వృద్ధుడు విద్యుత్ షాక్



**శివ్వంపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** గుండ్లపల్లి గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా మారింది. బోడింగ్ కుమార్ ఇంటికి వచ్చిన ఆయన మామ ఎల్లయ్య బుధవారం ఉదయం భవనంపై బట్టలు తీస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి కిందపడిపోయారు. కుటుంబ సభ్యులు తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటన అనంతరం గ్రామస్తులు ఇళ్ల మధ్యనున్న 11 కేవీ లైన్‌ను తొలగించాలని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ప్రమాదాలు జరిగాయని, అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యుత్ లైన్‌ను మార్చి ప్రమాదాలు నివారించాలని కోరారు.

## తూప్రాన్ మండల మహిళా సమాఖ్య 22వ మహాసభ



**తూప్రాన్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** తూప్రాన్ మండల మహిళా సమాఖ్య 22వ మహాసభ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది జరిగిన ఆర్థిక లావాదేవీలు, బడ్జెట్ వివరాలను చదివి వినిపించి సమీక్షించారు. రాబోయే ఏడాదిలో చేపట్టబోయే కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై చర్చించారు.
ఈ మహాసభలో సెర్ప్ ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, మహిళా సంఘాలకు అందుతున్న బ్యాంకు లింకేజీ రుణాలు, శ్రీనిధి రుణాలు, విశాల కార్యక్రమాలపై అధికారులు వివరించారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో శాలిని, ఎస్‌బీఐ మేనేజర్, డీసీసీబీ మేనేజర్ హాజరయ్యారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సంపూర్ణ, కార్యదర్శి రోజా, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు భాస్కర్ రెడ్డి, హరిచంద్, కృష్ణవేణితో పాటు అన్ని గ్రామాల ఓబీలు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమంపై వారోత్సవ కార్యక్రమాలు

**వనపర్తి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు జిల్లాలో వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.
వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, సాధికారతపై అవగాహన కల్పించనున్నారు. సెప్టెంబర్ 25న జిల్లాలోని పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. 26న వృద్ధాశ్రమాల సామర్థ్య పెంపు, 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వేధింపుల నివారణపై కార్యక్రమాలు నిర్వహిస్తారు.
29, 30 తేదీల్లో తరాల అనుసంధానం, ఆరోగ్యకరమైన వృద్ధాప్యంపై కార్యక్రమాలు చేపడతారు. అక్టోబర్ 1న జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## అమర జవాన్ యాదగిరికి 'బలిదాన్' పురస్కారం



**నవాబుపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** కూచూరు గ్రామానికి చెందిన దివంగత ఆర్మీ జవాన్ బసిరెడ్డి యాదగిరి త్యాగానికి గుర్తుగా భారత సైన్యం ప్రతిష్ఠాత్మక 'బలిదాన్' బ్యాడ్జ్ పురస్కారం అందించింది. పాలమూరులోని శ్రీరామ్‌నగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రదుర్గం ఆర్మీ సెంటర్‌కు చెందిన సుబేదార్ సుశీల్ కుమార్ తివారి, విజయ్ కుమార్‌లు యాదగిరి భార్య లలితకు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక బోర్డు అధికారులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, సహాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు. యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని, దేశభక్తి భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

## సెప్టెంబర్ 30లోగా రైతు రిజిస్ట్రీ పూర్తి చేయాలి

- కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి



**కొల్చారం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** రైతుల వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలను సులభంగా అందించేందుకు చేపడుతున్న రైతు రిజిస్ట్రీ ప్రక్రియను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత కుమారి సూచించారు.
కొల్చారం మండలంలోని రైతులు తమ ఆధార్, భూ వివరాలు, ఇతర అవసరమైన సమాచారంతో రైతు రిజిస్ట్రీని పూర్తి చేసుకోవాలని తెలిపారు. రైతు రిజిస్ట్రీ వివరాలు ధాన్యం (వరి) కొనుగోలు ప్రక్రియతో అనుసంధానమై ఉన్నందున, రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు.
రిజిస్ట్రీ పూర్తయితే ధాన్యం కొనుగోలు సమయంలో రైతుల వివరాల నమోదు, సంబంధిత ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సెప్టెంబర్ 30లోగా రైతు రిజిస్ట్రీని పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కోరారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



**కొత్తపల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** బహుజన చక్రవర్తి, వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను కొత్తపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని పలువురు కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. యువత ఆయన జీవిత చరిత్రను తెలుసుకుని ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, పి.రామ్ రెడ్డి, ఏ.బుచ్చిరెడ్డి, తులసి రామ్ నాయక్, టి. వెంకటరెడ్డి, రాములు గౌడ్, విద్యార్థులు, గౌడ సంఘం ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## గద్వాలలో ఘనంగా 11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు




**గద్వాల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** 'ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం' నినాదంతో జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు 11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గోన్పాడు గ్రామంలో కమ్యూనిటీ అవుట్‌రీచ్ హెల్త్ క్యాంప్ నిర్వహించి ఆయుర్వేదం, యోగా, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ప్రాంగణంలో తులసి, కలబంద, వేప, వాము తదితర ఔషధ మొక్కల ప్రదర్శన ఏర్పాటు చేసి, వాటి ఉపయోగాలను వివరించారు. ప్రజలకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ముగింపు సందర్భంగా వైద్యులు, విద్యార్థులు, ఆయుష్ సిబ్బంది భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముగింపు సభలో అధికారులు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వ్యాధుల నియంత్రణకు ఆయుర్వేదం, యోగా ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమాల్లో వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# విఎస్పి స్టీలు పరిశ్రమపై ఐటి అధికారుల దాడి




**హత్నూర, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా,హత్నూర మండలం, చందాపూర్ గ్రామ శివారులో ఇనుము, స్టీలు, ఫెర్రోఅలాయ్ లను ఉత్పత్తి చేస్తున్న విఎస్పీ ఇస్పాత్ స్టీలు పరిశ్రమపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడి చేశారు.పరిశ్రమ ప్రధాన గేటు మూసివేయించి పోలీసుల పహారాలో సోదాలు నిర్వహించారు.ఉదయం నుండి రాత్రి వరకు సుదీర్ఘ సమయం పాటు తనిఖీలు కొనసాగుతుండటంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.పరిశ్రమ నిర్వహణకు సంబంధించిన ఆదాయ వ్యయాలు,పన్నుల చెల్లింపు తదితర అంశాలను నమోదు చేసే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది, మీడియాను సైతం లోనికి అనుమతించక పోవడంతో సోదాలో ఏం జరిగింది అనే విషయం తెలియరాలేదు.

## నేడు సంగారెడ్డి జిల్లాలో కమిషన్ చైర్మన్, సభ్యుల పర్యటన

- ఎస్సీ, ఎస్టీ సమస్యలపై రాష్ట్ర కమిషన్ సమీక్ష
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు టి. అఖిలేష్ రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య ఐదుగురు కమిషన్ సభ్యులతో కలిసి ఈ నెల 24న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు టి. అఖిలేష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా 24 ఉదయం 10.30 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఫిర్యాదుల సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసులు, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ల అమలు, ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ తదితర అంశాలపై సమీక్ష చేపట్టనున్నారు.

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు తదితర అంశాలపై పూర్తి, తాజా వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఉప సంచాలకుడు సూచించారు.

## పచ్చదనం వైపు అడుగులు.. పాఠశాలలో మొక్కల సందడి






**కోహిర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ బాయ్స్ పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మహ్మద్ జాకీర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌నాథ్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పచ్చని వాతావరణమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాట అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. పాఠశాల ఆవరణలో పచ్చదనం పెరగడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు విద్యార్థుల్లో ప్రకృతిపై మమకారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి అన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు బుధవారం అల్లాదుర్గం తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను మండలంలోని పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మల్లయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి బాల కిషన్, సర్పంచులు పంపాటి వీరప్ప, శ్రీనివాస్ రెడ్డి, శశిధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కవిత విఠల్, మన్యా నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ సమతుల్యతతోనే పుష్కలంగా వర్షాలు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** మొక్కలను నాటి వృక్షాలుగా పెంచి సంరక్షిస్తే వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణతో పాటు స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని మరియంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమార్ అన్నారు. పచ్చదనంతో కాలానుగుణంగా పుష్కలంగా వర్షాలు కురిసే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ నాగేశ్వరి, కార్యదర్శి శివానంద్, ఉపాధ్యాయురాలు స్రవంతి, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పురాతన కట్టడాలను పరిశీలించిన ఎంపీడీవో దామోదర్



**చిన్న శంకరంపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** చందంపేటలోని పురాతన గడిని ఎంపీడీవో దామోదర్, సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పురాతన కట్టడాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పురాతన కట్టడాల సంరక్షణకు చర్యలు చేపడుతోందని తెలిపారు. కట్టడం మరమ్మతుల అవసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్ కుమార్, ఉపసర్పంచ్, నర్సింలు పాలకవర్గ సభ్యులు, రామకృష్ణ, నరేష్, గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత భవిష్యత్



**మక్తల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని ఎంఈఓ ఖాజా అమీరుద్దీన్ సూచించారు. మాద్వార్ ఎంపీపీఎస్‌లో బుధవారం విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, సాక్సులు, బెల్టులను పంపిణీ చేశారు. సర్పంచ్ డా.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకట్రాములు, కమిటీ చైర్ పర్సన్ అంజమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సర్పంచ్ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రాగిజావ, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం సూచించారు. అనంతరం ఎంఈఓ తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పాఠశాల ప్రహరీ వద్ద ముళ్లకంచె తొలగించాలని ఆదేశించారు.

## ఈ నెల 26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 23(జనంసాక్షి):** వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప వీరనారి అని కలెక్టర్ తెలిపారు. జయంతి వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## భారీ వర్షాల దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సర్పంచ్ పట్లోళ్ల సంగారెడ్డి
- యూసుపూర్‌లో గడ్డి మందు పిచికారి



**రాయికోడు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని యూసుపూర్ సర్పంచ్ పట్లోళ్ల సంగారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన గ్రామంలోని పారిశుద్ధ్య పనుల నిర్వహణలో భాగంగా పిచ్చి మొక్కల తొలగింపు పై గడ్డి మందునీ పిచికారి చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలందరూ దోమల బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తుఫాన్ కారణంగా ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరు కూడా చెట్ల కింద నిలువ రాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్మికులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలు



**కోహిర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మనియర్‌పల్లి సర్పంచ్ రాజ్‌కుమార్ అన్నారు. కోహిర్ మండలం మనియర్‌పల్లిలో మెడికల్ ట్రస్ట్ ఆఫ్ ది సెవెంత్ డే అడ్వెంటిస్ట్, సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ సందర్శించి వైద్యుల సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామీణ ప్రజలకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యానికి గురైన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాధులను గుర్తించడం ముఖ్యమన్నారు. గ్రామాల్లో తరచూ వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. వైద్య సేవలను గ్రామీణ ప్రజలకు చేరువ చేయడంలో స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు, అడ్వెంటిస్ట్ సభ్యులు, పాస్టర్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

• అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కింగ్ కాని, అసాధారణ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాల పరిశీలనను వేగవంతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాల నిర్ధారణ కోసం 12 రకాల గుర్తింపు, ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. హియరింగ్‌కు హాజరై అవసరమైన ధ్రువపత్రాలు, వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించి సహకరించాలని కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మొత్తం 4,11,717 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 2,48,395 మంది ఓటర్ల



హియరింగ్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.

అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలను కలెక్టర్ స్వీకరించారు. హియరింగ్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖాజాబీ బేగం మృతికి ఎమ్మెల్యే నివాళి



**చిలప్‌చేడ్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** బండపోతుగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ హుస్సేన్ మాతృమూర్తి ఖాజాబీ బేగం (87) మృతి చెందారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల వివరాలను అడిగి తెలుసుకుని, కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ఫైజాబాద్ బీఆర్ఎస్ నాయకుడు రామస్వామి సుధాకర్ గౌడ్ మాతృమూర్తి రుక్కమ్మ కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాల నియామకాలకు ప్రొవిజనల్ మెరిట్ జాబితా

• డిఎంహెచ్ఓ లలితాదేవి

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని బస్తీ దవాఖానాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ విడుదల చేసిందనీ జిల్లా వైద్యాధికారి లలితాదేవి తెలిపారు.

ఈ ఏడాది జూలై 15న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాలను పరిశీలన కోసం సంగారెడ్డి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని అధికారులు సూచించారు. అభ్యంతరాలను సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు, గది నంబర్ 13లో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో అందజేయాలి.

గడువు అనంతరం అందే అభ్యంతరాలను స్వీకరించబోమని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు.

## దుద్దెడ అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం



**కొండపాక, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** దుద్దెడ గ్రామంలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఇందిరా మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య, పోషకాహారం అవసరమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మిద్దె శివకుమార్ మాట్లాడుతూ అంగన్వాడీల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## మెలిగిపేటలో ఘనంగా వినాయక నిమజ్జన రథయాత్ర



**సదాశివపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** సదాశివపేట మండలం మెలిగిపేట గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. వినాయక రథయాత్రలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏకదంత వినాయకుని వద్ద నిర్వహించిన లడ్డూ వేలంపాట ఆసక్తికరంగా సాగింది. 25 కిలోల లడ్డూను సింగూర్ అంజిరెడ్డి రూ.1,01,000కు దక్కించుకున్నారు. రెండో లడ్డూను పెద్దగొల్ల మల్లేశం రూ.66,000కు, మూడో లడ్డూను తెలుగు తుల్జారం రూ.45,000కు సొంతం చేసుకున్నారు. రథయాత్రను విజయవంతం చేసిన గ్రామస్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## హరిత, శుభ్రత భారతానికి శ్రీకారం





**న్యాల్‌కల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** పీఎం శ్రీ పథకంలోని 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'హరిత, శుభ్రత భారతం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ ల్యామ్ మేరీ ఆధ్వర్యంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో సుమారు 100 మొక్కలు నాటారు. బాదం, త్రిదళం, మర్రి, వేప, చింత, అల్లనేరేడు, గులాబీ, గుల్మోర్ తదితర రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సర్పంచ్ మాట్లాడుతూ మొక్కల పెంపకంతో ఆక్సిజన్ లభ్యత, కాలుష్య నియంత్రణ, వాతావరణ సమతుల్యత, నీటి వనరుల పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సదాలక్ష్మి, రాజాసింగ్, జగదీశ్వర్, అర్జున్, శ్రీనివాస్, స్వర్ణలత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల మండల టీపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



**చేర్యాల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** చేర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా బి.బాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సీ.నరేష్, ఎం.స్వరూపారాణి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా బి.నరహరి, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.సమ్మయ్య, కౌన్సిలర్ పి.కొండల్ రెడ్డి, ఆడిట్ సభ్యులుగా కె.గోవిందరాజులు, వి.శశిధర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి సత్య కృష్ణ, జిల్లా నేతలు పాల్గొన్నారు.

## జనంసాక్షి వార్త ఎఫెక్ట్

• డ్రైనేజీ సమస్యపై స్పందించిన కమిషనర్



**వనపర్తి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు గ్రీన్ రోడ్స్ కాలనీ, సూర్యచంద్ర స్కూల్ రోడ్, అభి స్పోర్ట్స్




సమీపంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై జనంసాక్షి దినపత్రికలో ప్రచురించిన వాస్తవిక పరిస్థితి పై కుమార్ భేదడి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.కాలువకు మెయిన్ డ్రైనేజీ చానల్‌కు సరైన కనెక్షన్ లేకపోవడంతో మురుగు నీరు సక్రమంగా వెళ్లడం లేదని, దీంతో కాలనీలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన, దోమల సమస్య ఏర్పడుతోందని తెలిపారు.

కుమార్ భేదడి కోరగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే కాలనీకి వచ్చి సమస్యను స్వయంగా పరిశీలించి వెళ్లారు. డ్రైనేజీ సమస్యను పరిశీలించి, మెయిన్ చానల్‌కు కనెక్షన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ సాగర్, వెంకటేశ్వర్ గౌడ్, శ్రీనివాస రాజు, కిరణ్ కుమార్, కుమార్ భేదడి తదితరులు పాల్గొన్నారు.

## మిత్ర విహార్‌లో ఘనంగా శ్రీవారి కల్యాణం



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** బీరంగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో 10వ రోజు వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ పలు గణపతి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పటేల్‌గూడ మిత్ర విహార్ కాలనీలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండువగా జరిగింది. నందారం నరసింహా గౌడ్ పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సద్భావనను పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## రమేష్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం





**రామాయంపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** మాజీ జడ్పీటీసీ, తెలంగాణ ఉద్యమకారుడు పర్వతపూర్‌కు చెందిన చంద్రపు రమేష్‌రెడ్డి అరవ వర్ధంతి సందర్భంగా బుధవారం హరితవన మహోత్సవం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు లక్ష్మాపూర్-పర్వతపూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. లక్ష్మాపూర్ చౌరస్తా వద్ద ప్రయాణికుల కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ బోయిని స్వామి మాట్లాడుతూ రమేష్‌రెడ్డి తన రాజకీయ గురువని, కార్యకర్తలను సమన్వయంతో నడిపించారని గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండేవారని భార్య మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. రమేష్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు సూచించారు.

# భూ నిర్వాసితుల రైతులకు ఇళ్ల స్థలాల పట్టా పత్రాల పంపిణీ

• టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి






**కొండాపూర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** మండల పరిధిలోని తోగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూబాధిత రైతులకు ఇళ్ల స్థలాల పట్టా పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. సోమవారం లాటరీ పద్ధతి లో డ్రా నిర్వహించి రైతులకు ప్లాట్ల నంబర్లను కేటాయించగా, ఆ నంబర్ల ప్రకారం బుధవారం పట్టా సర్టిఫికెట్లను అందజేశారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాల పట్టా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, గతంలో భూములు తీసుకునే సమయంలో ఇచ్చిన హామీ మేరకు భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు జగ్గారెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. పట్టా పత్రాలు అందుకున్న భూ బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ పేరుతో పేదల భూములను లాక్కోవద్దు...

• అక్రమణకు భూములను స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలి

**కొండపాక, సెప్టెంబర్, 23 (జనంసాక్షి):** కొండపాక మండలం వెల్కట్ట పరిధిలో ప్రభుత్వం భూములను, గ్రామ కంఠం స్థలాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని హెచ్చరిక బోర్డులు స్వాదినం ఆక్రమణలపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని అమ్ముల బాల్ నర్సయ్య అన్నారు. 22-ఏ పేరుతో కొండపాక మండలం వెలికట్టతో పాటు వివిధ గ్రామాలలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని ప్రభుత్వం చెబుతోందని,వెలికట్ట 271 సర్వే నెంబర్ లో 327ఎకరాల 9 గుంటల భూమి వాస్తవంగా ఆక్రమణకు గురైందని సీపీఐ(ఎం) పేర్కొంటోందన్నారు. ఈ వ్యవహారంపై రాజకీయ ఆరోపణలకు తావులేకుండా సమగ్ర కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ మంత్రి 327-09 ఎకరాల భూముల ఆక్రమణపై అసెంబ్లీలో ప్రస్తావించారని బాల్ నర్సయ్య తెలిపారు. ఎవరు ఆక్రమించినా మండలంలో ఎక్కడ భూములు ఆక్రమణకు గురైనా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు.గ్రామాలలో గ్రామ కంఠం భూములు అక్రమంగా ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ అధికారులకు దరఖాస్తులు ఇచ్చిన బుట్ట దాకలు అవుతున్నాయని, అట్టి భూములను పేదలకు పంచాలని, ఇండ్లస్థలాలు ఇవ్వాలని కోరారు.భూ ఆక్రమణలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పేదల పక్షాన సీపీఐ(ఎం) ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందని బాల్ నర్సయ్య స్పష్టం చేశారు. అవసరమైతే పేద ప్రజలకు భూములు పంపిణీ చేసేలా ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు.

# ఎస్.ఐ.ఆర్-2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**జడ్చర్ల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్-2026 ప్రక్రియను గడువులోగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆదేశించారు. బుధవారం జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. నియోజకవర్గంలో 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఏఈఆర్‌ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి, విచారణలకు ఓటర్లు హాజరయ్యేలా పార్టీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ నర్సింగ రావు, మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, ఎన్నికల డీటీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

• తహశీల్దార్ బి.సుగుణ





**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని తహశీల్దార్ బి.సుగుణ సూచించారు. మండలంలోని రోడ్డుమీది తండాలో బుధవారం నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలు, గుర్తింపు పత్రాలను ఆమె పరిశీలించారు. బీఎల్ఓలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు.

నోటీసులు అందుకున్న ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన గుర్తింపు పత్రాలను సేకరించి సంబంధిత నోటీసులకు జత చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ సరైన సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవజా నాయక్, బీఎల్ఓ నాగలక్ష్మి, తండా వాసులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు

• హాజరైన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి





**జడ్చర్ల, సెప్టెంబర్ 23(జనంసాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ వ్యాప్తంగా తొమ్మిదో రోజు వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. నిమజ్జన ఏర్పాట్లను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సిగ్నల్ గడ్డపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొ న్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని కృత్రిమ కొలనులో తొమ్మిదో రోజు విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొని, నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం ప్రజలకు, ఉద్యోగులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మన్న, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మీపతి, అసిస్టెంట్ ఇంజనీర్ గాయత్రి, రెవెన్యూ ఆఫీసర్ సలాం, సీనియర్ అసిస్టెంట్ ముజుబుద్దీన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగేష్, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గోప్లాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. మాజీ సర్పంచ్ చెన్నయ్య కుమారుడు స్నేహిత్ రూ. 41వేలకు లడ్డూను, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఏ. నరసింహులు కలశాన్ని దక్కించుకున్నారు.

# బీచుపల్లిలో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరలోనే పూర్తిచేసి, ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని సాంకేతిక బృందం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు రైతులకు గెలల సేకరణ, తూకం, రవాణా మరియు ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని రాజ్‌కుమార్ తెలిపారు.

అనంతరం అయిజ మండలం వెంకటాపురం స్టేజి వద్ద ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని సాంకేతిక బృందం పరిశీలించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. కేంద్రంలో వెయ్‌బ్రిడ్జి, రైతు సేవా కేంద్రం తదితర సౌకర్యాల ఏర్పాటుకు నిధులు, అనుమతులు మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతులకు సులభతరంగా గెలల సేకరణ, తూకం, రవాణా సౌకర్యాలు కల్పించేలా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ - సివిల్ ఇంజనీర్, టీజీ ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూరాల కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల



**ధరూర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** పంటలను కాపాడుకునేందుకు ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో జూరాల కుడి, ఎడమ ప్రధాన కాలువలకు బుధవారం సాగునీరు విడుదల చేశారు. జోగులాంబ గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల రైతులు, ప్రతిపక్షాల ఆందోళనల అనంతరం సాగునీటి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేశారు. ఎడమ ప్రధాన కాలువకు 750 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 350 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1,100 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఆయకట్టు అవసరాల మేరకు ప్రవాహాన్ని దశలవారీగా పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

• కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్య, పారిశుధ్యం తదితర సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

చేర్యాల గ్రామంలోని కుల సంఘాలకు సంబంధించిన స్థలాలను ఆయా సంఘాలకే కేటాయించాలని, టీజీఐఐసీ పేరుతో ఇతర అవసరాలకు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ప్రాంతాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు మంజూరు చేసి నిర్మించాలని కోరారు. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.

సైదాపూర్ తండాలో వాటర్ ట్యాంక్‌కు వెళ్లే దెబ్బతిన్న మెట్లను మరమ్మతు చేయాలని, టీజీఐఐసీ భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో పారిశ్రామిక అవసరాలతో పాటు కనీస మౌలిక వసతులకు అవసరమైన భూమిని కేటాయించాలని కోరారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు ప్రహరీ గోడలు లేని ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి గోడలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో డ్రైనేజీలు, మురుగు కాలువలు, కల్వర్టులు, అంతర్గత రహదారుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే మంజూరైన పెండింగ్ పనులపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి త్వరగా ప్రారంభించి పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామకంతం స్థలానికి ఎన్వోసీ జాప్యం..

- మూడు నెలలుగా పంచాయతీ కార్యాలయం చుట్టూ బాధితుడి ప్రదక్షిణలు
- పాలకవర్గం తీర్మానం తర్వాతే ఎన్వోసీ: పంచాయతీ కార్యదర్శి



**కొల్చారం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** గ్రామకంతం స్థలానికి ఎన్వోసీ (నిరభ్యంతర ధ్రువపత్రం) మంజూరులో జాప్యం జరుగుతోందని ఎనగండ్ల గ్రామానికి చెందిన లంబాడి కుమార్ ఆరోపించారు. మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..** 1980లో సుమారు 20 గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు. అప్పట్లోనే ఆ స్థలాన్ని గ్రామకంతంగా మార్చారని, అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లుగా ఆయా కుటుంబాలు అక్కడే నివాసం ఉంటున్నాయని తెలిపారు.

తన తండ్రి ధనరాజ్ పేరున ఉన్న స్థలంలో పాత ఇల్లు కూలిపోవడంతో కొత్త ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ బ్యాంకు రుణం పొందేందుకు ప్రయత్నించానని కుమార్ తెలిపారు. అయితే బ్యాంకు అధికారులు గ్రామపంచాయతీ నుంచి ఎన్వోసీ తీసుకురావాలని సూచించడంతో మూడు నెలలుగా పంచాయతీ కార్యదర్శిని సంప్రదిస్తున్నానన్నారు. పాలకవర్గం తీర్మానం చేసిన తర్వాతే ఎన్వోసీ ఇస్తామని కార్యదర్శి చెబుతున్నారని తెలిపారు. 40 ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటూ క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నామని, పాత ఇల్లు కూలిపోవడంతో కొత్త ఇంటి నిర్మాణానికి రుణం అవసరమైందని కుమార్ పేర్కొన్నారు. గ్రామకంతంగా ఉన్న స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ ఎన్వోసీ జారీ చేయడంలో జాప్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించి ఎన్వోసీ మంజూరు చేయాలని కోరారు.

**పంచాయతీ కార్యదర్శి వివరణ...** ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్‌ను వివరణ కోరగా.. దుంపలకుంటలోని సర్వే నంబర్ 331లో ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. నూతన పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎవరికీ అనుమతులు మంజూరు చేయలేదని చెప్పారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిన అనంతరం మాత్రమే ఎన్వోసీ మంజూరు చేస్తామని కార్యదర్శి రాజుగౌడ్ స్పష్టం చేశారు.

### పర్యాటక దినోత్సవం సందర్భంగా
# పర్యాటక ప్రదేశాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించింది. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ...** మెదక్ జిల్లాకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి సంపద ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం ద్వారా సందర్శకులకు మంచి అనుభూతిని కల్పించడంతో పాటు జిల్లాకు పర్యాటకంగా మరింత గుర్తింపు లభించేలా చేయవచ్చన్నారు. జిల్లాలోని మెదక్ ఖిల్లా, చర్చి, ఏడుపాయల వన దుర్గాభవాని ఆలయం, పోచారం వన్యప్రాణి అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్, చారిత్రక కోటలు, చెరువులు, జలపాతాలు, దేవాలయాలు తదితర పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌ఓ రామచంద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ నవీన్, ఈ డి యం సందీప్, మహేందర్, ఆర్ ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌పీవోలతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి





**రామాయంపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** రైతులు సంఘటితంగా ఏర్పడి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు) ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఝాన్సిలింగాపూర్‌లో ఎఫ్‌పీవోల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన సదస్సుతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. తునికి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులకు ఎఫ్‌పీవోలు ప్రయోజనకరమన్నారు. సంఘంగా ఏర్పడి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో పాటు దళారుల ప్రమేయం లేకుండా పంటలను నేరుగా మార్కెట్‌లో విక్రయించి మెరుగైన ధరలు పొందవచ్చన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ఆధునిక సాగు, సామూహిక వ్యవసాయం, పంటల నిల్వ, మార్కెటింగ్ విధానాలను రైతులు పరిశీలించారు. ప్రభుత్వ ఆర్థికసాయం, రాయితీలు, సాంకేతిక సహకారంపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మానేగాళ్ల రామకృష్ణ, వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, ఏఈవోలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఐటీఏ-2026 అవార్డుకు నాంచారుపల్లి ఉపాధ్యాయిని



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):** విద్యార్థులకు వినూత్న బోధనా పద్ధతులతో నాణ్యమైన విద్య అందించేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా సిద్ధిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్. స్రవంతి రాష్ట్రస్థాయి ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు (ఐటీఏ-2026)కు ఎంపికయ్యారు. జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏటా వినూత్న బోధనా విధానాలతో విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరుస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఈ అవార్డులు అందజేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది దరఖాస్తు చేసుకోగా, 50 మందిని అవార్డులకు ఎంపిక చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎస్. స్రవంతికి అవార్డు అందజేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా కొత్త బోధనా పద్ధతులను అమలు చేస్తూ, నాణ్యమైన విద్య అందించేందుకు ఆమె చేస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించింది. అవార్డు అందుకున్న సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అవార్డు రావడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడే వినూత్న విధానాలను అనుసరిస్తూ వారి విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. అవార్డుతో తనకు మరింత ప్రోత్సాహం, స్ఫూర్తి లభించిందని పేర్కొన్నారు.

**అభినందనలు...** స్రవంతిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు అభినందించారు. గ్రామీణ పాఠశాలలో పనిచేస్తూ వినూత్న బోధనా పద్ధతులతో విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరుస్తున్న ఆమెకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# క్రీడా స్ఫూర్తితోనే సమగ్ర వికాసం





**గండీడ్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలకమని ఎంఈఓ జనార్ధన్, ఎస్సై శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం కె.ఎం.చంద్రకాంత్ అన్నారు. రుసుంపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలికల 70వ ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, సమన్వయం, సహకారం, పరస్పర గౌరవం వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. పోటీల్లో 10 పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్-17 ఖోఖోలో జడ్పీహెచ్‌ఎస్ వెన్నాచేడ్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ కొమిరెడ్డిపల్లి ద్వితీయ స్థానాలు సాధించాయి. కబడ్డీలో కేజీబీవీ గండీడ్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ వెన్నాచేడ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ గౌరమ్మ, ఉపసర్పంచ్ అంజమ్మ, పీడీ రాములు, పీఈటీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం
# నిల్వలపై టాస్క్ ఫోర్స్, పోలీసుల దాడులు

- భారీగా మద్యం స్వాధీనం



**మక్తల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** మక్తల్ మండల పరిధిలో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న వారిపై టాస్క్ ఫోర్స్, మక్తల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మక్తల్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్‌లో కిరాణా దుకాణాలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో లక్ష్మణ్ గౌడ్ వద్ద నుంచి 13.5 లీటర్ల మద్యం, పి.వెంకటేష్ వద్ద నుంచి 17.5 లీటర్ల మద్యం, స్వాధీనం చేసుకున్నారు.

సంగంబండ రోడ్డు కాలువ సమీపంలోని ధాబాల వద్ద అనధికారికంగా నిల్వ ఉంచిన మద్యంపై పోలీసులు దాడులు జరిపారు. మక్తల్ పట్టణానికి చెందిన మోహన్ నాయక్ వద్ద 21 లీటర్ల మద్యం, కొత్తగార్లపల్లి గ్రామానికి చెందిన ఓ. లక్ష్మణ్ వద్ద 7.5 లీటర్ల మద్యం పట్టుబడ్డాయి.

ఈ నాలుగు వేర్వేరు కేసుల్లో మొత్తం 59.5 లీటర్ల మద్యాన్ని, సుమారు రూ. 29,540/- విలువైన సరుకును సీజ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయించే వారిపై మా నిఘా నిరంతరం ఉంటుంది. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజు తెలిపారు.

### ప్రయాణికుల
# భద్రతకు ఎస్సై మహేష్ తక్షణ చర్యలు





**ఉప్పునుంతల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఉప్పునుంతల-తాడూరు ప్రధాన రహదారిపై కుంగిపోయిన కల్వర్టుకు పోలీసులు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేయించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రయాణికుల భద్రత, ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ ఆదేశాల మేరకు పోలీస్ కానిస్టేబుల్ రాందాస్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు.

కల్వర్టు కుంగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉండటంతో పోలీసులు వెంటనే స్పందించారు. తాత్కాలిక మరమ్మతులు పూర్తిచేసి రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఉప్పునుంతల, తాడూరు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రజల భద్రత విషయంలో తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన ఎస్సై పుట్ట మహేష్, పోలీసు సిబ్బందికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## చెరువును తలపిస్తున్న రహదారి



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండల కేంద్రంలో చెరువును తలపిస్తున్న రహదారి అంటూ ప్రచూరించిన కథనానికి ఎర్రవల్లి గ్రామ సర్పంచ్ అనిత కృష్ణ సాగర్ తక్షణమే స్పందించి నీటి మళ్లింపు చర్యలు చేపట్టాడు. న్యూస్ కథనానికి స్పందించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాగన్న పెద్ద లక్ష్మన్న ధర్మారెడ్డి దశరథం సాగర్ పరశురాం రాజేష్ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆయుర్వేద దినోత్సవ వేడుకలు



**మల్దకల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** 11వ ఆయుర్వేద దినోత్సవం--2026ను పురస్కరించుకుని మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు. 'ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం' ప్రధాన సందేశంతో ఆయుర్వేదం, యోగా, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్ వైద్య విధానాలతో ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై వివరించారు. డా.జయమ్మ మాట్లాడుతూ ఆయుర్వేదం, యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి గూర్చి ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, వెరిఫై చేసిన తరవాత ఆ దస్త్రాలను కలెక్టరేట్‌కి పంపించాలని ఆదేశించారు. ఆయా మండలాల వారిగా ప్రణాళిక ప్రకారం గెజిటెడ్ ఆఫీస్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని నిర్మాణ దశలకు అనుగుణంగా అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని, నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలి



పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమమని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి భగవంత్ రావు, డిఈ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించాలి

- **బీఎల్‌వో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక**

**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా బూత్ లెవల్ అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం నారాయణపేట పట్టణంలోని 142, 143 పోలింగ్ స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్న బీఎల్‌వోల సర్వేను జిల్లా కలెక్టర్ ఆక స్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నోటీ సులు అందుకున్న ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి వివరాలను ధృవీకరించాలని, వారి నుంచి అవసర మైన ధృవీకరణ పత్రాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు నమో దయ్యేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు ఆమె సూచించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావు



లేకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో ధృవీకరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ఎల్.అరుణ పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ...**

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి అధ్యాపకులు, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని



యోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సూచించారు.

**మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష...**

ఆ తర్వాత జిల్లా కలెక్టర్ నారాయణపేట మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పట్టణంలో కొనసాగుతున్న పరిశుభ్రత చర్యలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సేవలను సమర్థవంతంగా అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# వంద మంది రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాలు

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఉప్పునుంతల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, జునాగఢ్ వేరుశనగ పరిశోధనా సంస్థ సాంకేతిక సిబ్బంది పాల్గొని వంద మంది రైతులకు గిర్నార్-4 రకం వేరుశనగ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.

గతంలో జునాగఢ్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వేరుశనగ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా. ఎస్.కె. బేరాతో జరిగిన సమావేశంలో ఉప్పునుంతల రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యకలాపాలు, వేరుశనగ విత్తనోత్పత్తి, రైతులకు సాంకేతిక సహాయంపై చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ముందస్తు క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం కింద విత్తనాలను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డా. శశిభూషణం, డా. శోభ, జునాగఢ్ వేరుశనగ పరిశోధనా సంస్థ సాంకేతిక సిబ్బంది దేవకాంత్ సింగ్, అనంతపురం సాంకేతిక సిబ్బంది మహేష్‌రెడ్డి రైతులకు గిర్నార్-4 రకం ప్రత్యేకతలు, శాస్త్రీయ సాగు పద్ధతులు, పంట యాజమాన్య పద్ధతులు, క్షేత్ర పరిశీలన, పంట వివరాల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంట కాలమంతా రైతులకు అవసరమైన సాంకేతిక




మార్గదర్శకాలు అందించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ మడ్డు నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు సూరం నారాయణరెడ్డి, మాచర్ల సాయిబాబు, పంగ కృష్ణయ్య, ముఖ్య కార్యనిర్వహణాధికారి కొత్త రవీందర్‌రావు, స్థానిక సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు, సహాయక నిపుణుడు తరుణ్ తేజ్, కట్ట అనంతరెడ్డి, పద్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, వెంకటయ్య, రమేష్‌రెడ్డి, పరుశురామ్‌రెడ్డి, శేఖర్, సురేందర్‌రావు తదితరులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో సొంత నిధులతో ఫంక్షన్ షెడ్ నిర్మాణం



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో బహుళ ప్రయోజనాల ఫంక్షన్ షెడ్డును సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర సమన్వయకర్త బొజ్జ అమరేందర్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మించారు. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ షెడ్డును నిర్మించినట్లు తెలిపారు. గ్రామంలోని పలు సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు, ఇతర ప్రజా కార్యక్రమాలకు ఈ షెడ్ ఉపయోగపడనుంది. సొంత నిధులతో షెడ్డును నిర్మించిన బొజ్జ అమరేందర్‌రెడ్డిని స్థానికులు అభినందించారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన వై.శ్రీలతకు సన్మానం

**మల్దకల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన ఎంబీబీఎస్ తొలి దశ ఫలితాల్లో మల్దకల్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి



చెందిన వై.అమృత్ కుమార్,వై.స్వప్న దంపతుల కుమార్తె వై. శ్రీలత ఎంబీబీఎస్ సీటు సాధించింది.విషయం తెలుసుకున్న దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర సలహాదారుడు,జిల్లా ఉపసర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పాల్వాయి ఎస్.రంజిత్ కుమార్,దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్వారం ఎస్.తిరుమలేష్ విద్యార్థిని వై. శ్రీలతను శాలువాతో బుధవారం సన్మానించి,స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

# సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం: నవాబుపేట ఎస్సై వాకిటి నరేందర్

**నవాబుపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు నవాబుపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్సై వాకిటి నరేందర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించవద్దన్నారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. నకిలీ పెట్టుబడులు, ఉద్యోగ ప్రకటనలు, లోన్ ఆఫర్లను నమ్మి మోసపోవద్దన్నారు.





సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే నగదు రికవరీకి అవకాశం ఉంటుందన్నారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ అందుబాటులో ఉంటుందని, సైబర్ నేరాల నివారణకు సహకరించాలని కోరారు.

# ప్రజలకు నాణ్యమైన ఆయుష్ సేవలు అందించాలి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్**




**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్య సేవలు అందించడంతో పాటు ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ధన్‌రాజ్ సూచించారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని స్వచ్ఛ బడి ఆవరణ, పాత ఎంసీహెచ్, బురుజు వద్ద బుధవారం ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించారు. డా. ధన్‌రాజ్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఆయుష్ మందులు, చికిత్సా విధానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా ఝాన్సీ మాట్లాడుతూ ఆయుష్ వైద్యంతో తాను కంటి సంబంధిత సమస్యకు మంచి ఫలితాలు పొందినట్లు తెలిపారు. మాజీ కౌన్సిలర్ దీప్తి నాగరాజు మాట్లాడుతూ శరీరం, మనస్సు, జీవనశైలిని సమగ్రంగా పరిగణించే హోలిస్టిక్ వైద్య విధానమే ఆయుష్ అని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన శిబిరంలో 300 మందికిపైగా రోగులు వైద్య సేవలు పొందారు. దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, అస్తమా, అలెర్జీలు, కిడ్నీలో రాళ్లు, థైరాయిడ్, బీపీ, మధుమేహం, చర్మ వ్యాధులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 100 మందికి మధుమేహం, బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డా. కె. అనిల్‌కుమార్, డా. ఉమాదేవి, డా. భానుతేజ, వైద్యులు, ఫార్మసిస్టులు, యోగ ఇన్‌స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సమన్వయంతో నిర్వహించాలి

- **ట్రైని డిప్యూటీ కలెక్టర్ భవ్య**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని ట్రైని డిప్యూటీ కలెక్టర్ భవ్య అధికారులకు సూచించారు. ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా జిల్లాలో 150 మంది విద్యార్థులచే పర్యాటక ప్రాంతాల సందర్శన, ఒక ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతం, ఎకో టూరిజం పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉందని అన్నారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, ఎకోటూరిజం ప్రాంతాన్ని ఎంపిక చేయడం జరుగుతుందని ఆ ప్రాంతాలను 27వ తేదీ రోజు విద్యార్థులచే ట్రిప్ నిర్వహించి జిల్లాలో గల పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు, ఇతరులకు అవగాహన కలిగేలా కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు, ఫుడ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ విజయ్ భార్గవ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగరాజు, విద్య, రవాణా, మున్సిపల్, యువజన, క్రీడలు, కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ దశరథ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



**అడ్డాకుల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** అడ్డాకుల గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొక్కలపల్లి దశరథ్‌రెడ్డికి గ్రామ ప్రజలు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కీర్తిశేషులు శ్రీ లక్ష్మీదేవమ్మ, రాంరెడ్డి దంపతుల సుపుత్రుడైన దశరథ్‌రెడ్డి తల్లిదండ్రుల సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలతో మమేకమై గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో సేవా ప్రయాణం విజయవంతంగా కొనసాగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని కోరుకున్నారు.

# ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డంకి కాదు

- **చిట్టెం కిష్టన్న**



**అయిజ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** పట్టుదల, ఏకాగ్రతతో చదివితే ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కావని చిట్టెం కిష్టన్న అన్నారు. తూముకుంట గ్రామానికి చెందిన చిట్టెం వెన్నెల నీట్‌లో మంచి ర్యాంక్ సాధించి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూ ఆమె సాధించిన విజయాన్ని గ్రామస్తులు అభినందించారు. తల్లిదండ్రులు నెరవాటి లలిత, చిట్టెం కిష్టన్నలు ఆమెను ప్రోత్సహించారు. వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి గ్రామీణ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని వెన్నెల ఆకాంక్షిస్తోంది. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# పది తరగతి ఉతిర్నులకు పురస్కారాలు



**కృష్ణ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** పదవ తరగతి 2025 2026 సంవత్సరానికి ప్రథమ శ్రేణిలో పాసైన విద్యార్థులకు కన్నడా మిత్ర కూట సంఘం రాయచూర్ వారీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషద్ కృష్ణ పాఠశాల విద్యార్థులను సన్మానించి పారితోషకం అందజేశారు. ఈ కార్యక్ర మంలో కన్నడ సంఘం అధ్యక్షులు మాజీ ఎంపీపీ మల్లన్న గౌడ పోలీస్ పాటేల్, శ్రీనివాస్ దొఖ అశోక్ జైన్, మండల విద్యాధికారి నిజాముద్దీన్, రామలింగప్ప, బషీర్, అహమద్, శ్రీనికికుమార్, డొఖ రామన్న మ్యదర్ విజయకుమార్, కుర్డి ఆమర్ కుమార్ దీక్షిత్ కిషోర్ కుమార్ సర్పంచ్ సొలాపూర్ నాగేష్, ఉప సర్పంచ్ రేష్మ, తదితరలు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడికి పరిష్కారంగా బోరుబావి

- **రెండు అంగుళాల నీటి లభ్యతతో కాలనీవాసులకు కొంత ఊరట**
- **19వ వార్డు కౌన్సిలర్ సూగురు మురళీ సాగర్**



**వనపర్తి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
వనపర్తి పట్టణంలోని 19వ వార్డు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కౌన్సిలర్ సూగురు మురళీ సాగర్ తెలిపారు. మంచినీటి ఎద్దడిని నివారించేందుకు బుధవారం వార్డులో మహిళలతో పూజ చేయించి కొత్త బోరుబావిని తవ్వించారు. బోరులో సుమారు రెండు అంగుళాల నీరు లభించడంతో కాలనీవాసులకు తాగునీటి సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందన్నారు.

వేసవి ప్రారంభం నుంచి వార్డులో మంచినీటి సమస్య తీవ్రతరమైందని, భూగర్భ జలాల లభ్యతలో మార్పులు, నీటి వనరులపై పెరిగిన ఒత్తిడి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల మేరకు సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలోనే వార్డులో రెండు బోరుబావులు ఏర్పాటు చేయగా, వాటిలో నీరు లభించడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు కొంత ఉపశమనం కలిగిందన్నారు. తాజాగా తవ్వించిన బోరులోనూ నీరు లభించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నీటి లభ్యతను బట్టి అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వార్డులోని మంచినీటి సమస్యను మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లడంతో జనరల్ బడ్జెట్ కింద బోరుబావుల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేస్తామని, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని మురళీ సాగర్ తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- **బీజేవైఎం మండల అధ్యక్షుడు వొట్టేవోళ్ల సురేష్**



**కృష్ణ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల విద్యా భవిష్యత్తును కాపాడాలని బీజేవైఎం కృష్ణ మండల అధ్యక్షుడు వొట్టేవోళ్ల సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రభుత్వం దశలవారీగా చెల్లింపులు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ భారీగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఫీజులు చెల్లించాలంటూ కొన్ని కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, దీంతో పరీక్షలు, సర్టిఫికెట్లు, తదుపరి విద్యకు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కళాశాలలు, జిల్లాల వారీగా బకాయిల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేసి, చెల్లింపులకు స్పష్టమైన తేదీలతో కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

బకాయిల కారణంగా విద్యార్థులపై అదనపు ఫీజు భారం మోపకుండా చర్యలు తీసుకోవాలని, ఈ–పాస్ దరఖాస్తుల పరిష్కారానికి మండల స్థాయిలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల విద్యా హక్కుతో ముడిపడి ఉందన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి శాంతియుతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, విద్యార్థి ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సాగునీటి కష్టాలకు డీకే అరుణ, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వైఖరే కారణం - టిఆర్ఎస్




**గద్వాల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** నడిగడ్డ రైతుల సాగునీటి ఇబ్బందులకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిల వైఖరే కారణమని టీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆరోపించారు. నెట్టెంపాడు పరిధిలోని రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు ఎందుకు పూర్తిచేయలేదని ఆయన ప్రశ్నించారు. కృష్ణానది సమీపంలోనే ఉన్నా రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని రంజిత్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైతాంగం పంటలు ఎండిపోయి అల్లాడుతుంటే, ప్రజాప్రతినిధులు మాత్రం రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. పాలకులు ఇప్పటికైనా తమ స్వార్థ రాజకీయాలను పక్కనబెట్టి, నెట్టెంపాడు పెండింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. యుద్ధప్రాతిపదికన కాలువల మరమ్మతులు చేపట్టి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నడిగడ్డ అన్నదాతల హక్కుల కోసం టీఆర్ఎస్ శ్రేణులు ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతూనే ఉంటాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.




## వర్షపు నీరు.. వాహనదారులకు కన్నీరు

బిజినపల్లి, సెప్టెంబర్ 23(జనంసాక్షి):
కొద్దిపాటి వర్షాలకే రోడ్లపై నిలిచిన వర్షపు నీటితో మండల కేంద్రం నుండినాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్లే బాలేదా వాహనదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నది. బిజినపల్లి మండల కేంద్రంలోని పాత సినిమా టాకీస్ ముందు ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు కారణంగా వాహనదారులతో పాటు రోడ్డుపై ఉన్న ఇంటి యాజమానుల ఇండ్లలోకి ఈ నీళ్ళు పోయి చిట్లుతున్నాయని వారు అంటున్నారు. ఈ ప్రధాన రహదారి గుండా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు ఎంతో మంది ప్రయాణిస్తున్నా వారి కంటికి కనిపించడం లేదు. ఈ దృశ్యం అధికారులకు కనిపించకుండా కళ్లు పోయాయా లేక చూసి చూడనట్లుగా ఉంటున్నారా అని స్థానికులు ఆగ్రహిస్తున్నారు.

## విలేకరి నరసింహులుపై దాడిని తీవ్రంగా ఖండన



మల్దకల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి): గద్వాల పట్టణంలో విజన్ ఆంధ్ర విలేకరి నరసింహులుపై జరిగిన దాడిని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య తీవ్రంగా ఖండించారు. బుధవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులును పరామర్శించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్న నరసింహులుపై ఔటర్ రింగ్ రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో ఇద్దరు యువకులు దాడి చేయడం బాధాకరమన్నారు. ఘటనపై గద్వాల రూరల్ ఎస్సై విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో విలేకరులపై దాడులు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అరుణమ్మ నియామకం రాష్ట్ర బిజెపి నేతల హర్షం



నారాయణ పేట సెప్టెంబర్ 23 (జనంసాక్షి): పాలమూరు పార్ల మెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ తమిళనాడు రాష్ట్ర సహ ఇంచార్జీగా నియామకం కావడం పట్ల పట్ల బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు కే.రతంగ్ పాండు రెడ్డి, పగుడాకుల శ్రీనివాసులు, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.అరుణమ్మను నియమించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియమితులైన అరుణమ్మకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.అరుణమ్మ నేతృత్వంలో తమిళనాడులో బిజెపి పటిష్టం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలింపు

### వాహనం స్వాధీనం.. ఇద్దరిపై కేసు



ఉప్పునుంతల, 23 (సెప్టెంబర్): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఉప్పునుంతల పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. మండల కేంద్రం శివారులోని మైల్‌స్టోన్ పాఠశాల సమీపంలో టీఎస్ 32 టీ 8329 నంబర్ వాహనంలో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ దిండి చింతపల్లి గ్రామానికి చెందిన కంపల్లి శంకరయ్య, యజమాని వంగూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గండికోట లక్ష్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి. మహేష్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసిన ఘటనపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వాతావరణానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయం చేయాలి

### కొత్త సాంకేతికత, ప్రత్యామ్నాయ పంటలతో లాభసాటి సాగు సాధ్యం: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయం చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తిలోని పద్మావతి శ్రీనివాస గార్డెన్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా–2026లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మేళాలో మేలురకం విత్తనాలు, సోలార్ ఫెన్సింగ్, వ్యవసాయ మందులు, పశుసంపద, కోళ్లు, పొట్టేళ్లు, ఉద్యానవనం, పట్టు పరిశ్రమ, పామాయిల్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆధునిక వ్యవసాయ యంత్రాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్టాళ్లను సందర్శించి ఉత్పత్తుల వివరాలను పరిశీలించారు. కొత్త వంగడాలు, ఆధునిక పద్ధతులు, యాంత్రిక పరికరాలను రైతులకు ఒకే వేదికపై పరిచయం చేయడమే మేళా ఉద్దేశమన్నారు. ప్రతి మంగళవారం రైతు వేదికల్లో జరిగే రైతు నేస్తం కార్యక్రమాలకు హాజరై శాస్త్రవేత్తల సూచనలు పొందాలని కోరారు.

జిల్లాలో వర్షపాతం గణనీయంగా తగ్గిందని కలెక్టర్




తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, ఈ ఏడాది 42 సెంటీమీటర్లు మాత్రమే నమోదైందన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని సూచించారు. గత వానాకాలంలో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగుకాగా, ఈ ఏడాది 1.70 లక్షల ఎకరాలకు తగ్గిందని, మినుము సాగు 30 వేల ఎకరాలకు పెరగడం అభినందనీయమన్నారు.

పామాయిల్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని, మొదటి మూడేళ్లు అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. వచ్చే ఏడాది జిల్లాలో పామాయిల్ క్రషింగ్ కంపెనీ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. భూమి సారాన్ని కాపాడే





దుకు సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, కేవీకే ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తల్పునూర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలి

- 100 రోజుల దీక్షకు రేవల్లి మండల నాయకుల మద్దతు

రేవల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):
తల్పునూర్ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 100 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా రేవల్లి మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు డప్పు వాయిద్యాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి దీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

మాజీ జడ్పీటీసీ బోర్ల భీమన్న మాట్లాడుతూ.. తల్పునూర్ భౌగోళికంగా నాగర్‌కర్నూల్‌కు సమీపంలో ఉన్నందున పరిపాలనా సౌలభ్యం కోసం ఆ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. 100 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. డిమాండ్ నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. దీక్షలో పాల్గొన్న వారికి నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి మద్దతు ప్రకటించారు.

**ఎమ్మెల్యే హామీ అమలు చేయాలి...**

దీక్షా శిబిరంలో వక్తలు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ సుమారు 12–15 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వనపర్తి జిల్లా కేంద్రం 30 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉందన్నారు. విద్య, వైద్యం, రవాణా, ఉపాధి తదితర అవసరాలకు నాగర్‌కర్నూల్ అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తల్పునూర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు కుంటి నరసింహ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. తమ డిమాండ్ సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. వనపర్తి జిల్లా






ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచులు, యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్వరాలలో యునాని వైద్య శిబిరం




పెబ్బేరు, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):
11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కల్వరాల గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రభుత్వ యునాని వైద్యాధికారి డాక్టర్ బ్యాగరి సరిత ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై జె. నరేష్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, ఉపసర్పంచ్ తడకల రంగమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యునాని, ఆయుర్వేద వైద్య విధానాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నరసింహ కోరారు. అనంతరం గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సరితను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్య, పంచాయతీ, విద్యాశాఖ సిబ్బంది, యోగా శిక్షకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇన్‌స్పెక్షన్ మార్గానికి అడ్డంగా గుంత.. వ్యక్తిపై కేసు!

- ఆర్డీవో ఫిర్యాదుతో గోపాల్‌పేట పోలీసుల చర్యలు



గోపాల్‌పేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి): ఏదుల గ్రామ శివారులో ప్రభుత్వ నీటిపారుదల శాఖకు చెందిన ఇన్‌స్పెక్షన్ మార్గాన్ని ఆక్రమించి, రాకపోకలకు అడ్డంగా గుంత తవ్విన వ్యక్తిపై గోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్డీవో డి. సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఏదుల గ్రామానికి చెందిన జిల్లెల శ్రీనివాస్ రెడ్డి, తండ్రి స్వర్గీయ గోపాల్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సర్వే నంబర్లు 304, 306, 307, 370, 371 పరిధిలోని ఇరిగేషన్ ఇన్‌స్పెక్షన్ మార్గానికి అడ్డంగా గుంత తవ్వడంతో రైతులు, నీటిపారుదల శాఖ అధికారులు, వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో మార్గం నిర్మాణం కోసం భూమిని సేకరించి పట్టాదారులకు పరిహారం చెల్లించినట్లు రెవెన్యూ నివేదికల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# హౌసింగ్ లబ్ధిదారుల జాబితాను వారం రోజుల్లో పూర్తి చేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారుల వివరాలను మరోసారి పరిశీలించి, ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీల వారీగా జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఆధార్ తదితర వివరాలు అందుబాటులో లేని అర్హుల సమాచారాన్ని మూడు రోజుల్లో సేకరించాలని సూచించారు. అర్హత ఉన్న కేసుల్లో ధ్రువీకరణ, శాఖాపరమైన పరిశీలన, మంజూరు ప్రక్రియలను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని ఆదేశించారు.

భౌతికంగా నిర్మాణానికి అనుకూలంగా లేని, క్లిష్టమైన, గ్రౌండింగ్‌కు అవకాశం లేని కేసులను ప్రత్యేకంగా గుర్తించి వివరాలను వేరుగా సమర్పించాలన్నారు. మిగిలిన అర్హుల కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. వచ్చే వారంలో హౌసింగ్ పనులపై మరోసారి సమీక్ష నిర్వహించనున్నందున అప్పటిలోగా పెండింగ్ జాబితాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.



మున్సిపాలిటీల పరిధిలో ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖలు చేపట్టాల్సిన రోడ్ల పనుల జాబితాలను ప్రాధాన్యతా క్రమంలో రూపొందించి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో నష్టపోయిన కుటుంబాలకు అందించిన సహాయానికి సంబంధించిన, ఇప్పటికే మంజూరై పనులు ప్రారంభమైన కేసుల వివరాలను కూడా అందించాలన్నారు. అదనపు నిధులు అవసరమైన కేసులకు ప్రత్యేక ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల ఏఈలు పాల్గొన్నారు.

# లారీ-కారు ఢీ... ఒకరికి గాయాలు





**మిడ్జిల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** మండలంలోని వాడ్యాల గేటు సమీపంలో ఎన్ హెచ్ 165 రహదారిపై బుధవారం లారీ. కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని అంబులెన్సులో చికిత్స నిమిత్తం మహబూబ్నగర్ తరలించారు. ఎస్సై శ్రీనివాసులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కారును యూటర్న్ తీసుకుంటుండగా జడ్చర్ల నుండి కల్వకుర్తికి వెళుతున్న లారీ. కారును బలంగా ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కారును ఢీ కొట్టిన లారీ డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు.

# జనంసాక్షి కథనంతో నోటీసులు జారీ చేసిన అధికారులు


ముదిరెడ్డిపల్లిలో వంట ఇటుకల తయారీ పరిశ్రమ ఉందా ?

**రాజాపూర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** జనంసాక్షి పత్రికలో "ముదిరెడ్డిపల్లిలో వంట ఇటుకల తయారీ పరిశ్రమ ఉందా" అనే కథనం రావడంతో స్పందించిన అధికారులు. రాజాపూర్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఎటువంటి అనుమతులు లేకుండా కలపగుజ్జు, వెరుశనగ పొట్టుతో కలప ఇటుకలు తయారు చేసే పరిశ్రమ కు ఎటువంటి అనుమతులు లేవని, ఏమైనా అనుమతులు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో అనుమతి పత్రాలు అందజేయాలని పంచాయతీ కార్యదర్శి పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

# మతసామరస్యాన్ని చాటుకున్న కాంగ్రెస్ కౌన్సిలర్



**చేర్యాల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అని చాటుతూ చేర్యాల మున్సిపాలిటీకి చెందిన ఓ కౌన్సిలర్ మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచారు. చేర్యాల మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం-ఖాజా దంపతులు తమ వార్డు పరిధిలోని రజక నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బుధవారం సందర్శించారు. భక్తులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొని అందరితో కలిసి వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు.

# గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి



**వెల్దండ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం, స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను జ్యోతి నిరంజన్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు.

# వైద్య శాఖలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ 11.10.2026 సాయంత్రం 05:00 గంటల వరకు మాత్రమే ఉండని పోస్టల్ ద్వారా పంపిన దరఖాస్తులు ఆలస్యంగా అందినట్లయితే, అందుకు ఈ కార్యాలయము ఎలాంటి బాధ్యత వహించదనీ తెలిపారు. పూర్తి వివరములకొరకు www.narayanapet.telangana.gov.inను సంప్రదించాలని సూచించారు.

# సాగునీటి ప్రాజెక్టుల సాధనే లక్ష్యం



**అయిజ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని అలంపూర్ తాలూకా జేపీసీ చైర్మన్ వై. రామ్మోహన్ డిమాండ్ చేశారు. అయిజ మున్సిపల్ కేంద్రంలోని మేడికొండ చౌరస్తాలో కరపత్రం విడుదల చేశారు. ఆర్డీఎస్, జూరాల, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులను పూర్తిచేయాలని కోరారు. ఆర్డీఎస్‌కు 15.7 టీఎంసీల నీరు, 87,500 ఎకరాల ఆయకట్టు హక్కు ఉందన్నారు. ఆర్డీఎస్‌కు బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేపీసీ వైస్ చైర్మన్ యు. గోపాల్‌రెడ్డి, నాగరదొడ్డి వెంకటరాములు, వినోద్, ఆంజనేయులు, హనుమంతు, ఉప్పల దేవన్న, ఉత్తనూర్ సంజన, లెనిన్‌బాబు, నక్క నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులకు నియామక పత్రాలు



**కృష్ణ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. నారాయణపేటలో జరిగిన సమావేశంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా నాయకులు నియామక పత్రాలు స్వీకరించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజప్ప గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అన్వర్, కార్యవర్గ సభ్యులుగా నాగేంద్ర, విజయ్ గౌడ్, సోమ సంతోష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలిపాటిల్ విజప్ప గౌడ్, షేక్ సర్ఫరాజ్ నూతనంగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయులు లేకుండానే గురుకులాల నిర్వహణ




• **ప్రధాన సబ్జెక్టుల బోధనకు దిక్కెవరు?**

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల విద్యపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి కీలక సబ్జెక్టుల్లో బోధనా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో చేగుంట, మెదక్, కొడిపల్లి, నర్సాపూర్ ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాల, యూఆర్‌జేసీ బాలికల పాఠశాలలు, స్పోర్ట్స్ పాఠశాల, సీఒఈ బాలుర కళాశాల, యూఆర్‌జేసీ బాలుర పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోసైన్స్, బోటనీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పీడీ తదితర సుమారు 25 నుంచి 30 సబ్జెక్టుల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు సమాచారం.

**ఆదేశాలు ఉన్నా.. నియామకాలు ఎక్కడ?**

గురుకులాల్లో సిబ్బంది కొరతను గుర్తించిన అధికారులు అవసరమైన చోట పార్ట్‌టైం ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించినట్లు సమాచారం. ఆగస్టు 10లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయాలని సూచించిన నేపథ్యంలో మెదక్ ఆర్‌సీఓ గంగారాం నాయక్ జూలై 20న ప్రకటన జారీ చేశారు. సుమారు 25 పార్ట్‌టైం పోస్టుల భర్తీకి జూలై 21 నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జూలై 28న చేగుంట బాలికల స్పోర్ట్స్ పాఠశాలలో అభ్యర్థులకు డెమోలు నిర్వహించారు.



**నెల రోజులు దాటినా.. పెండింగ్**

దరఖాస్తులు, డెమోలు పూర్తయి నెల రోజులు దాటినా నియామక ప్రక్రియ ముందుకు సాగలేదని అభ్యర్థులు చెబుతున్నారు. అధికారులను సంప్రదించగా కలెక్టర్ అనుమతి, సంతకం రావాల్సి ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇదే సమయంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామకాలు పూర్తయినట్లు సమాచారం.మెదక్‌లో మాత్రం జాప్యం కొనసాగడంపై అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

**పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్...**

నియామకాల జాప్యంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ప్రక్రియలో అక్రమాలకు అవకాశం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ అవి అధికారికంగా నిర్ధారణ కాలేదు. అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నియామకాలను పారదర్శకంగా పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించి పెండింగ్ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి, కీలక సబ్జెక్టులకు ఉపాధ్యాయులను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.